క్లుప్తంగా

కల్యాణం.. కమనీయం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. ఉదయం 9.30 నుంచి 10.30గంటల వరకు కల్యాణాన్ని అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం వైభవంగా జరిగింది. ఉభయదాతలకు స్వామి వారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు.

నేడు ఉత్తమ వలంటీర్లకు సన్మానం


కోన రామారావు, మండల పార్టీ అధ్యక్షుడు

పరవాడ: స్థానిక మరిడి మాంబ ఫంక్షన్ హాల్లో బుధవారం ఉదయం 9 గంటలకు ఉత్తమ వలంటీర్లను సన్మా నించనున్నట్టు వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కోన రామారావు ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ హాజరవుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి , జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైస్ ఎంపీపీలు పాల్గొంటారన్నారు. ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ముఖ్య నాయకులు హాజరై సన్మాన సభను విజయవంతం చేయాలని రామారావు కోరారు.

పండ్ల మొక్కల పంపిణీ


పండ్ల మొక్కలు అందజేస్తున్న సింహాద్రి జీజీఎం సిన్హా

పరవాడ: సింహాద్రి ఎన్టీపీసీ ఆధ్వర్యంలో మండలంలోని పలు గ్రామ పంచాయతీలకు పండ్ల మొక్కలు పంపిణీ చేశారు. సింహాద్రి ఎన్టీపీసీ దీపాంజలినగర్ టౌన్‌షిప్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముత్యాలమ్మపాలెం సర్పంచ్ చింతకాయల సుజాతముత్యాలకు సంస్థ జీజీఎం సంజయ్‌కుమార్ సిన్హా కొబ్బరి, మామిడి, జామ, సపోట వంటి పండ్ల మొక్కలు అందజేశారు. కార్యక్రమంలో జీవీఎంసీ 79 వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, పార్టీ నాయకులు చింతకాయల అమ్మోరు, సూరాడ ముత్యాలరావు, ఎస్.సోమేశ్వరరావు, కె. చినసోమేశ్వరరావు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్యస్వామికి విశేష అభిషేకాలు


సుబ్రహ్మణ్యస్వామి

సింహాచలం: అడవివరం విజినిగిరిపాలెంలోని ఉమాచంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో కొలువుదీరిన వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామికి మంగళవారం అభిషేకాలు, పూజలు విశేషంగా జరిగాయి. భక్తులు అధిక సంఖ్యలో పూజల్లో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు ద్వాదశి సోదరులు, ఉదయ్‌కృష్ణశర్మ పూజలు నిర్వహించారు.

పరీక్ష కేంద్రాల పరిశీలన


పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్న రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగంలో జరుగుతున్న పరీక్షలను రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ మంగళవారం పరిశీలించారు. ఎంబీఏ రెండో సెమిస్టర్ పరీక్షలను ప్రశాంత వాతావరణంలో, పటిష్టంగా నిర్వహించడంపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. విభాగాధిపతి ఆచార్య జాలాది రవి పాల్గొన్నారు.

ఉప్పు పంట వర్షార్పణం!

- అకాల వర్షాలతో రైతుల గగ్గోలు
- నష్టపోతున్నామని ఆవేదన

పరవాడ: మండు వేసవిలో అడపాదడపా కురుస్తున్న అకాల వర్షాలు ఉప్పు రైతుకు కన్నీళ్లు తెప్పిస్తున్నాయి. పంట చేతికి వచ్చే సమయంలో సోమవారం రాత్రి కురిసిన అకాల వర్షంతో వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెం ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉప్పు సేకరించాల్సిన సమయంలో వర్షం కురవడంతో మడుల్లో నీరు చేరింది.

ఇదీ పరిస్థితి

దలాయిపాలెంలో సుమారు 250 ఎకరాల విస్తీర్ణంలో ఉప్పు పంట సాగు చేస్తున్నారు. ఈ ఏడాది ఎండలు మెండుగా కాయడంతో అధిక దిగుబడులు వస్తాయని ఆశించిన రైతులకు అకాల వర్షాలు నిరాశ మిగిల్చాయి. ఎండాకాలంలో ఎడాపెడా కురుస్తున్న వర్షాలతో ఉప్పు పంటకు తీవ్ర నష్టం కలిగింది. వేసవి ఆరంభం నుంచి నాలుగైదు పర్యాయాలు భారీ వర్షాలతో కూడిన తేలికపాటి వర్షాలు కురవడంతో ఉప్పు పంటకు తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మార్చి, ఏప్రిల్, మే మూడు నెలలే కీలకం. ఎండలకు ఉప్పు మడుల్లో నీరు వేడెక్కి ఉప్పు దిగుబడులు పెరుగుతున్న తరుణంలో ఉన్నట్టుండీ కురిసిన వర్షాలకు ఉప్పు మడుల్లో వర్షపు నీరు చేరింది. దీంతో దిగుబడులు తగ్గిపోవడమే కాకుండా మళ్లీ మడుల నుంచి ఉప్పు తీయాలంటే 15 రోజులు సమయం పడుతుంది. దీనికి సాగు ఖర్చులు కూడా పెరుగుతున్నాయని వాపోతున్నారు.


దలాయిపాలెంలోని ఉప్పు మడుల్లో చేరిన వర్షపు నీరు

పెరిగిన ధరలు : వర్షాలు కురిసిన కారణంగా ఉప్పు దిగుబడులు ఆశించినంతగా లేవు. దీంతో ఉప్పు ధరలు పెరిగాయి. రూ.250 అమ్మే 80 కిలోల ఉప్పు బస్తా ప్రస్తుతం రూ.370 నుంచి రూ. 400 పలుకుతోంది.ఇటు రైతులకు వ్యయం పెరగడంతో పాటు వినియోగదారులకు భారం పడుతుంది.

వర్షాలు దెబ్బ తీశాయి

ఉప్పు పంటకు కీలకమైన మార్చి, ఏప్రిల్, మే నెలల్లో కురిసిన అకాల వర్షాలు పంటను తీవ్రంగా దెబ్బతీశాయి. ఈ ఏడాదైనా వేసవిలో అధిక దిగుబడులు తీయవచ్చునని ఆశించిన రైతులకు వర్షాలు తీవ్ర నిరాశమిగిల్చాయి. వర్షాలతో నాశనమైన ఉప్పు పంటతో ఆర్థిక నష్టాలను చవిచూస్తున్నాం.

– దలాయి రాముడు, ఉప్పురైతు, దలాయిపాలెం

ప్రభుత్వం ఆదుకోవాలి

ఈ ఏడాది అకాల వర్షాలతో ఉప్పు రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఉప్పుకు మంచి ధర పలుకుతున్న సమయంలో నిల్వలు లేకుండా పోయాయి. రెండేళ్ల నుంచి అకాల వర్షాలు దెబ్బ తీస్తున్నాయి. ఏటా అప్పులు చేసి ఉప్పు పంటకు దిగితే వర్షాలు రైతులను నట్టేట ముంచుతున్నాయి. ఆర్థికంగా నష్టపోతున్న ఉప్పు రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.

– ఎస్.వి.శ్రీనివాస్, ఉప్పు రైతు, దలాయిపాలెం

విద్యా రంగానికి సీఎం జగన్ పెద్ద పీట

- పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ఇస్లాంపేటలో జూనియర్ కళాశాల భవనం ప్రారంభం


కళాశాల భవనం ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

పెదగంట్యాడ: విద్యా రంగానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పెద్ద పీట వేస్తున్నారని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. జీవీఎంసీ 77వ వార్డు ఇస్లాంపేటలో రూ.2.18 కోట్లతో కొత్తగా నిర్మించిన జూనియర్ కళాశాల భవనాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో విద్యా రంగాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. నాడు–నేడు పథకం కింద పాఠశాలలు రూపురేఖలు మార్చిన ఘనత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ ప్రాంతంలో ముస్లిం మైనార్టీ విద్యార్థులు ఎక్కువ ఉన్నారని, 10వ తరగతి తరువాత ఎక్కువ శాతం మంది విద్యార్థులు చదువుకు స్వస్తి చెబుతున్నారని, ఇకపై అలా కాకుండా ఇక్కడ జూనియర్ కళాశాల ఏర్పాటు చేశామని వివరించారు. మంచి వాతావరణంలో విద్యా బోధన సాగించనున్నామన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కోరారు. కళాశాల ప్రిన్సిపాల్ బెన్నస్వామి మాట్లాడుతూ జూనియర్ ఇంటర్ అడ్మిషన్స్ ప్రారంభించామని తెలిపారు. ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ గ్రూప్స్ సీట్లను భర్తీ చేస్తున్నామని, ఆసక్తి ఉన్న విద్యార్థులు కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో 77వ వార్డు కార్పొరేటర్ బట్టు సూర్యకుమారి, జోనల్ కమిషనర్ పొందూరి సింహాచలం, ఎంపీ రెడ్డి, శివకుమార్, దావూద్, చిట్టిబాబు, సంజీవరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు


చిరు వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేస్తున్న ఎస్ఐ రమేష్

సింహాచలం: ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని చిరు వ్యాపారులకు పెందుర్తి ట్రాఫిక్ ఎస్ఐ రమేష్ హెచ్చరికలు జారీ చేశారు. పెందుర్తి రైతు బజారు వద్ద బీఆర్‌టీఎస్ రోడ్డుపై చిరువ్యాపారాలు దుకాణాలు పెట్టి ట్రాఫిక్ సమస్యకు కారణమవడంతో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చిరు వ్యాపారులకు నిబంధనలపై అవగాహన కల్పించారు. రైతు బజారులోకి వెళ్లే వాహనదారులు పార్కింగ్ చేసుకునే వీల్లేకుండా దుకాణాలు అడ్డంగా పెట్టవద్దని, రోడ్డుపైకి వచ్చి వ్యాపారాలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ

డీఎస్పీ సత్యనారాయణ



సబ్బవరం: ప్రజల సహకారంతోనే శాంతి భద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందని పరవాడ డీఎస్పీ కేవీ సత్యనారాయణ తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడారు. గంజాయి అక్రమ రవాణ, గుట్కా, లిక్కర్ రవాణాపై ఉక్కుపాదం మోపుతామన్నారు. జాతీయ రహదారి విస్తరణ తర్వాత రోడ్డు ప్రమాదాలు తగ్గినప్పటికీ వాహనదారులను మరింత అప్రమత్తం చేస్తున్నట్లు తెలిపారు. జాతీయ రహదారులకు ఇరువైపులా సర్వీస్ రోడ్లలో ప్రమాదాలు నియంత్రించేందుకు అవసరమయ్యే బింకలర్స్ ఏర్పాటు చేయడం, హైవే పెట్రోలింగ్ వారిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నామన్నారు. ఓపెన్ డ్రింకింగ్,మద్యం సేవించి వాహనాలు నడిపేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి మహిళ ఫోన్‌లో దిశ యాప్ డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు. అది వారి భద్రతకు వజ్రాయుధంలా ఉపయోగపడుతుందన్నారు. మహిళలు పలు రకాల వేధింపులు, సమస్యలపై ఫిర్యాదు చేసేందుకు ముందుకు రావాలన్నారు. ఆయనతో పాటు సీఐ రంగనాథం ఉన్నారు.

దశల వారీగా సమస్యల పరిష్కారం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- నక్కవానిపాలెంలో ఉత్సాహంగా గడప గడపకు..


నక్కవానిపాలెంలో డ్రైన్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్


మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సబ్బవరం: గ్రామాల్లోని ప్రతి సమస్యను దశల వారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ తెలిపారు. మండలంలోని అసకపల్లి శివారు నక్కవానిపాలెంలో పీఏసీఎస్ అధ్యక్షుడు కాపుశెట్టి శేషుబాబు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. గడప గడపకు వెళ్లి ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాల ద్వారా అందించిన లబ్ధిని గడపగడపకు వెళ్లి వివరించారు.ప్రభుత్వ పథకాలను ప్రజల ముంగిటకే చేరవేయడంలో ప్రభుత్వం ఆదర్శంగా నిలుస్తుందన్నారు.

డ్రైన్ల పరిశీలన

గ్రామంలో సీసీ రోడ్లు, డ్రైన్లను ఎమ్మెల్యే అదీప్‌రాజ్ పరిశీలించారు. శిథిలమైన వాటికి మరమ్మతులు చేపట్టి మురుగునీరు నిల్వ లేకుండా చర్యలు తీసుకోవాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పాలిశెట్టి సురేష్ రాజ్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొటాన రాము, మండల జేసీఎస్ కన్వీనర్ సబ్బవరపు ముత్యాలనాయుడు, ఎంపీటీసీ కర్రి అప్పారావు, ఎంపీడీవో రమేష్ నాయుడు, మాజీ సర్పంచ్ కాపుశెట్టి దేముడమ్మ, పార్టీ అధికార ప్రతినిధి వనం అచ్చెంనాయుడు, ఐడీబాబు,సచివాలయ కన్వీనర్ కాపుశెట్టి నీలమణి,పార్టీ సీనియర్ నాయకులు సబ్బవరపు నారాయణమూర్తి, వద్దాది అప్పలరాజు,ఉప సర్పంచ్ కరణం సురేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలు


మాట్లాడుతున్న సన్యాసిశెట్టి

సింహాచలం: గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని అడవివరం గ్రంథాలయ స్థల దాత దాసరి సన్యాసిశెట్టి అన్నారు. అడవివరం గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం మంగళవారం ఉత్సాహంగా సాగింది. సన్యాసిశెట్టి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన నిలయాలన్నారు. చిన్న పిల్లల నుంచి పెద్దవారి వరకు వీటిని వినియోగించుకుని విజ్ఞానాన్ని పెంచుకోవాలన్నారు. గ్రంథాలయ రీడర్స్ ఫోరం కమిటీ అధ్యక్షుడు బి.బి.రాజేంద్ర ప్రసాద్, టీపీకే వర్మ పాటల పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఈపోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి ఎస్.వి.నరసింహం, మోటివేటర్ గుమ్మడి కిరణ్‌కాంత్, పాఠకులు బి.సూర్యమోహన్, దీప్తి, వర, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

'కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గం'



రోజు ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: కార్మిక వర్గాన్ని అణచివేసే కేంద్ర ప్రభుత్వ విధానాలు దుర్మార్గమని విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు అన్నారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు మంగళవారం నాటికి 831వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో సంస్థకు చెందిన పలు విభాగాల కార్మికులు పాల్గొని స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకుడు మంత్రి రాజశేఖర్ మాట్లాడుతూ విశాఖ ఉక్కు అమ్మాలనే ఆలోచన వచ్చిన మోదీ ప్రభుత్వానికి ప్రజలు గట్టి బుద్ధి చెబుతారన్నారు. ప్రభుత్వరంగ సంస్థలను నిర్వీర్యం చేయడానికి కేంద్ర ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, ఈ ప్రయత్నాలను కార్మిక వర్గం ఒక తాటిపైకి వచ్చి తిప్పికొట్టాలన్నారు. దేశంలోని ప్రభుత్వ రంగ సంస్థలను బడా కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టాలనుకోవడం అన్యాయమన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరిగే ఉద్యమంలో ప్రజలందర్నీ భాగస్వాములు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు పాల్గొన్నారు.

మోదీ నిరంకుశ పాలనకు మూల్యం తప్పదు


జీవీఎంసీగాంధీ విగ్రహం వద్ద దీక్షలో పాల్గొన్న క్యాబ్ యూనియన్ నాయకులు

సీతమ్మధార : ప్రధాని నరేంద్ర మోదీ నిరంకుశ పాలనకు మూల్యం చెల్లించక తప్పదని క్యాబ్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.శ్రీరాములు హెచ్చరించారు. అఖిలపక్ష కార్మిక ప్రజా సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న దీక్షలు మంగళవారం నాటికి 788వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోదీప్రభుత్వంపై ప్రజలకు రోజురోజుకు అసహనం పెరిగిపోతుందని అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ రంగ సంస్థల అమ్మకాలు ఆపాలని లేని పక్షంలో ఉద్యమాలు మరింత ఉధృతం చేస్తామన్నారు. ప్రభుత్వ సంస్థలను అదానీ, అంబానీలకు అమ్మాలని చూస్తే ప్రజలు ఊరుకోరని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాయుడు, గోపీకృష్ణ, అప్పలరాజు, శివ, శ్రీనివాసులు, శ్రీను, ప్రసాద్ పలువురు నాయకులు పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి అష్టదళ పద్మారాధన


అష్టదళ పద్మారాధనలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో మంగళవారం 108 స్వర్ణ పుష్పాలతో అష్టదళ పద్మారాధన నిర్వహించా రు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాత లు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవో వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

25న సహస్ర తులసిపూజ

కనకమహాలక్ష్మి దేవస్థానంలో ఈ నెల 25న సహస్ర తులసిపూజ నిర్వహించనున్నామని ఈవో శిరీష తెలిపారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలిచే భక్తులు పూజా రుసుం రూ.1500 చెల్లించి దంపతులు ఈ పూజలో పాల్గొనవచ్చని పేర్కొన్నారు.

సైన్స్ జర్నల్ చీఫ్ ఎడిటర్‌గా కృష్ణా కళాశాల అధ్యాపకుడు


రామారావుకు నియామక పత్రం అందజేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు

మద్దిలపాలెం: డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల జంతుశాస్త్ర అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ కర్రి రామారావుకు అంతర్జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. ఇంటర్నేషనల్ జర్నల్ ఆఫ్ జువాలజీ స్టడీస్‌కు చీఫ్ ఎడిటర్‌గా ఆయన నియామకమయ్యారు. ఈ మేరకు సైన్స్ పత్రిక నియామక ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ జయలు అధ్యాపకుడు కర్రి రామారావుకు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ రామారావు అనేక అంతర్జాతీయ ప్రచురణలు, పుస్తకాల రచనతో పాటు సైన్స్ పత్రికలకు సంపాదకుడిగా , పర్యవేక్షకుడిగా పని చేస్తున్నారన్నారు. రామారావు కళాశాల కీర్తి ప్రతిష్టలు మరింత ఇనుమడింపజేశారని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు స్టాఫ్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు డాక్టర్ పి.సిహెచ్.విష్ణుమూర్తి, డాక్టర్ పోలా ఉమామహేశ్వరరావు, డాక్టర్ సుధీర్, డాక్టర్ రాజశేఖర్, రాజారావు పాల్గొన్నారు.

విమాన్ నగర్‌లో పాము కలకలం


విమాన్‌నగర్‌లో నాగు పామును పట్టుకున్న కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 90వ వార్డు విమాన్‌నగర్‌లో నాగు పాము కలకలం రేపింది. ఎస్ఎస్టీఎల్‌లో ఏడీఎఫ్ గా విధులు నిర్వహిస్తున్న నూనెల వెంకటేశ్వరరావు స్థానికంగా నివాసముంటున్నాడు. శనివారం ఉదయం సమయంలో బాత్‌రూమ్‌లోని కప్‌బోర్డులోకి పాము వెళ్లింది. స్థానికులు పామును బయటకు రప్పించేందుకు యత్నించినా ఫలితం లేక పోయిఒది. దీంతో పాము బయటకు రాకుండా ఖాళీల్లో గుడ్డలు అడ్డంగా పెట్టారు. ఏం చేయాలో తెలియక రెండురోజులు బిక్కుబిక్కుమంటూ గడిపారు. తెలిసిన వారి సలహామేరకు స్నేక్ క్యాచర్ కిరణ్‌కు సమాచారమివ్వడంతో మంగళవారం ఉదయం పామును చాకచక్యంగా పట్టుకున్నాడు. దీంతో వెంకటేశ్వరరావు కుటుంబం, స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ పాములు కనిపిస్తే 98491 40500నంబర్‌కు సమాచారమివ్వాలని కోరారు. వాటిని పట్టుకుని జన సంచారం లేని చోట విడిచి పెడతామని తెలిపారు.

నేటి నుంచి మహా కుంభాభిషేకం

అల్లిపురం: టూటౌన్ దరి శివరామకృష్ణ దేవస్థానంలో వెలసిన శ్రీ ధర్మ శాస్త (అయ్యప్పస్వామి)కి ఈ నెల 25,26 తేదీల్లో మహా కుంభాభిషేకం నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈవో డీవీఎస్ మూర్తి, గురుస్వామి నీలాపు రమణారెడ్డి, ఎల్.ఎ.సుకుమార్ తెలిపారు. టీటీడీ అధర్వణ వేద పండితులు అక్కా జోస్యుల రమేష్‌శర్మ పర్యవేక్షణలో ఈ కార్యక్రమం జరుగుతందన్నారు. అదే రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి 108 కలశాలతో శోభాయాత్ర ఉంటుందని తెలిపారు.

కాలువలో పడి వ్యక్తి మృతి

అల్లిపురం: మద్యం మత్తులో ఆర్టీసీ కాంప్లెక్స్ దరి కాలువలో పడి వ్యక్తి మృతి చెందిన ఘటన మంగళవారం తెల్లవారు జామున చోటు చేసు కుంది. టూటౌన్ సీఐ బి.తిరుమలరావు తెలిపిన వివరాల ప్రకారం విశాలాక్షినగర్‌కు చెందిన నడిగట్టు రవికుమార్(43) సెంట్రల్ ఎక్సైజ్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేసి రిటైర్ అయ్యాడు. తర్వాత మద్దిలపాలెంలో గల మహేంద్ర షో రూంలో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్నాడు. ఇతను తాగుడుకు అలవాటు పడ్డాడు. సోమవారం రాత్రి ఇంట్లో విజయనగరం వెళ్తున్నానని చెప్పి కాంప్లెక్స్ వచ్చాడు. మంగళవారం తెల్లవారి అతను కాలువలో పడి మృతి చెందిన విషయం గమనించిన ఆర్టీసీ సిబ్బంది పోలీసులకు సమాచారం అందజేశారు. దీంతో పోలీసులు ఘటనా స్థలికి వెళ్లి మృతదేహాన్ని కేజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుని తండ్రి అప్పలస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్ట్‌మార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు తెలిపారు.